## 15 సంవత్సర చందాలు చెల్లింపు

విశాలాంధ్ర - అనకాపల్లి: విశాలాంధ్ర జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నక్కపల్లి విలేకరి రమణచారి 10 సంవత్సర చందాలు, మాకవరపాలెం విలేకరి సర్వం 5 సంవత్సర చందాలకు సంబంధించిన నగదును ఎడిషన్ మేనేజర్ సనపల నరసింహులుకు అందజేశారు. బ్యూరో బి.కొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా విలేకరులు పాల్గొన్నారు.

# అత్యధిక మెజార్టీ ఇచ్చారు... అభివృద్ధి చేసి చూపిస్తా..

### హోం మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించి, హోం మంత్రిని చేసిన ప్రజలకు, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పాయకరావుపేట నియోజకవర్గంలో వంగలపూడి అనిత ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభమైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనిత మాట్లాడుతూ వందరోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు గుర్తించారని తెలిపారు. గతంలో ఫించను విషయంలో వృద్ధులను రోడ్లుపై నిలబెట్టారని, వాలంటీర్ లేకపోతే ఫించన్లు పంపిణీ చేయలేమనే భావనలో గతంలో వైసీపీ ప్రభుత్వం, అధికారులు ఉన్నారన్నారు. ఇప్పుడు సచివాలయం సిబ్బంది ఒక్కరోజులో 90 శాతం ఫించన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఒకటవ తేదీ సెలవు వస్తే, ముందు రోజే ఫించన్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడమే కాకుండా, పోలవరం ప్రాజెక్ట్ కు అత్యధిక నిధులు తీసుకువచ్చిన ఘనత ఎన్డియే కూటమిది అన్నారు. పాయకరావుపేట మేజర్ పంచాయతీకి అన్నా క్యాంటీన్ మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారని, రేషన్ డిపోలో బియ్యంతో పాటు పంచదార ఇవ్వమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారని తెలిపారు. గత ప్రభుత్వంలో పంచాయితీలను భ్రష్టు పట్టించారని ఆవేదన వ్యక్తం చేసారు. పాయకరావుపేటలో డబుల్ రోడ్డు వేస్తానని హామీ ఇచ్చారు. ప్రతీ గ్రామంలో సమస్యలు పరిష్కరించే దిశగా, గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, సోమవారం ఫిర్యాదుల బాక్స్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రతి పౌరుడు గౌరవంగా జీవించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు.

పాయకరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో హెూం మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్., పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. డ్రైనేజీలు, శ్మశాన వాటికలు, కల్వర్టులు, రోడ్లు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని వెంకటనగరం, రాజానగరం తుఫాన్ షెల్టర్లు శిధిలమయ్యాయని, వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠినంగా

చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రూ. 50 లక్షలతో పనులకు శంకుస్థాపన**

పాయకరావుపేట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవనానికి హోం మంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించడానికి బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాయకరావుపేటలో జరిగిన కార్యక్రమాల్లో ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వరరావు, ఎంపీపీ ఇసరవు పార్వతి, వైస్ ఎంపీపీలు ధనిశెట్టి మాధవి, పల్లెల మణికంఠ స్వామి, టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన నాయకులు గెద్దం బుజ్జి, తోట నగేష్, నాయకులు గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, యాళ్ల వరహాల బాబు, గూటూరు శ్రీనివాసరావు, మల్లపురెడ్డి రమకుమారి, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, చింతకాయల రాంబాబు, బొంది కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీపై అవగాహన

విశాలాంధ్ర - చోడవరం: ఏ.పి. స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలు మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో "మీకు తెలుసా" అనే కార్యక్రమం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్, స్కీమ్ సూపర్వైజర్ టి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి. లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమం చోడవరం, చీడికాడ, తిమిరంలో తదితర గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ స్వామి, మంగమ్మ, సి ఎల్.డబ్ల్యూ పి.సూర్య కళ, ఐ.సి.టి.సి. కౌన్సిలర్ మూర్తా శ్రీనివాసరావు, స్టాఫ్ నర్సు భవాని, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు, యూత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి జూడో గేమ్స్‌కి వడ్డాది హైస్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: రాష్ట్రస్థాయి జూడో గేమ్స్‌కి వడ్డాది హైస్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 19న అనకాపల్లిలో జరిగిన జోనల్ స్థాయి జూడో గేమ్స్ పోటీలలో ఎనిమిదో తరగతి విద్యార్థులు దాసరి రోహిణి, ఆర్.రిషి, జి.చరణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 23 నుండి తిరుపతిలో జరగబోయే స్టేట్ జూడో గేమ్స్‌లో వీరు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విద్యార్థులను హెచ్ఎం పివి శేషుబాబు, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ, డ్రిల్ మాస్టర్ నరసింగరావు అభినందించారు.

## సింహాద్రి ఎన్టీపీసీలో జిప్సం విక్రయాలు ప్రారంభం

విశాలాంధ్ర - పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో జిప్సం విక్రయాలను సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్‌సిన్హా గురువారం ప్రారంభించారు. పర్యావరణ నిరంతర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఉద్గారాలను తగ్గించేందుకు సింహాద్రి పవర్ ప్లాంట్ నుంచి వస్తున్న ఫ్లూ గ్యాస్ ఆధారంగా ఉప ఉత్పత్తిగా జిప్సంను తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు సింహాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కేవలం ఫ్లైయాస్‌ను మాత్రమే ఉచితంగా అందజేస్తుంది. ఇప్పుడు జిప్సంను విక్రయించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా గురువారం జిప్సం విక్రయాలు ప్రారంభించారు. సింహాద్రి ఫ్లూ గ్యాస్ డిసల్ఫరైజేషన్ యూనిట్ల ద్వారా జిప్సంను ఉత్పత్తి చేస్తున్నారు. బొగ్గు దహన ప్రక్రియలో ఉత్పత్తి అయ్యే సల్ఫర్ డయాక్సైడ్‌ను జిప్సంగా మార్చి ఉత్పత్తి చేస్తున్నారు. జిప్సంను సిమెంట్, వ్యవసాయ, ఇతర పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. సింహాద్రి పర్యావరణ ప్రమాదకారిని విలువ ఆధారత ఉప ఉత్పత్తిగా మార్చారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్‌సిన్హా మాట్లాడుతూ జిప్సం ఒక్క పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా ఆర్థిక విలువలో భాగమైందన్నారు. జిప్సం రా మెటీరియల్‌గా వినియోగించే పరిశ్రమలు ఆత్రుతతో సింహాద్రి వైపు ఎదురుచూస్తున్నాయన్నారు. వాయు కాలుష్య ప్రభావిత ఉద్గారాలను తగ్గించేందుకు అధునాతన పరిజ్ఞానాన్ని వినియోగిస్తామన్నారు.

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - నక్కపల్లి: ఎన్నికల హామీలలో ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రక్షణ చట్టం బీసీలకు 33% రిజర్వేషన్ కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు మండల టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, మహిళలు పాలాభిషేకం చేశారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పిక్కి గంగరాజు ఆధ్వర్యంలో ముందుగా గ్రామంలో ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం అని చెప్తూ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, రాజయ్యపేట సర్పంచ పిక్కి అప్పలనర్స, ఎంపీటీసీ పీక్కి సత్తయ్య, రాజయ్యపేట తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, మాజీ ఉప సర్పంచ్ సిరిపిల్ల అప్పలరాజు, ఐటీడీపీ అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు మదద రాంబాబు, పిక్కి దేవుడు, రాజయ్యపేట జనసేన పార్టీ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జీ), పిక్కి నాగరాజు, గొసల కుమారి, పిక్కి చిన్నారి, పీక్కి పైడితల్లి, పీక్కి గోపి మైలపల్లి ప్రసాద్, చోడిపల్లి అప్పలరాజు, కారే తాతాజీ, పిక్కి రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎల్ పురంలో మండల స్థాయి ఆటల పోటీలు

విశాలాంధ్ర - గొలుగొండ: క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా శరీర దృఢత్వానికి కూడా ఎంత దోహదపడతాయని జెడ్పీటీసీ వెంకట గిరిబాబు, ఏఎల్ పురం సర్పంచ్ అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత తెలిపారు. శుక్రవారం మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం జడ్పీహెచ్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఆధ్వర్యంలో మండల స్థాయి బాల బాలికల ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఓ.సత్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ లగుడి రాజుల నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు టివి రమణ, ఎంపీటీసీలు మామిడి కృష్ణ, గుప్తల రామకృష్ణ, చింతల బుల్లి ప్రసాద్, అవినాష్ నాయుడు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 30 నుండి వైద్య ఒప్పంద కార్మికులు సమ్మె

విశాలాంధ్ర - కె.కోటపాడు: సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్ వైజర్ కార్మికులు దశల వారి ఆందోళనతో ఫలితం లేక పోవడం వలన గత్యంతరం లేని పరిస్థితి లలో ఈ నెల 30 నుంచి సమ్మె వెళుతున్నట్లు కార్మికులు తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీ లక్ష్మికి సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులు 20 రోజులుగా నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలుపుతున్నా..అధికారులు నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే... బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. 30 నుంచి విధుల బహిష్కరణ ఉంటుందని తలిపారు. కార్యక్రమంలో నూకరత్నం, అరుణ, సత్యవతి, ఈశ్వరమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో శ్రీరామపురం జంక్షన్ వద్ద గంజాయి తరలిస్తున్న కారును స్థానిక ఎస్సై మల్లేశ్వరరావు గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి కారులో తరలిస్తున్నారని ముందుస్తు సమాచారంతో తమ సిబ్బందితో కలిసి శ్రీరామపురం జంక్షన్ వద్ద గంజాయి తరలిస్తున్న కారుతో పాటు ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రెండు లక్షల విలువ చేసే అరవై నాలుగు కేజీల గంజాయిని, మూడు సెల్ ఫోన్లు, తొమ్మిది వందల రూపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడిన వారిలో కొర్రా రంజు (30), కొర్రా అర్జున్(28), డ్రైవర్ కార్తీక్(40)లను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

# వేతనాలు పెంచకుంటే సమ్మెకు సిద్ధం

### విశాఖ డెయిరీ యాజమాన్యానికి వేతన కార్యదర్శులు హెచ్చరిక

విశాలాంధ్ర - అనకాపల్లి: తమ సహకార సంఘాల ద్వారా పాలను సేకరించి విజయ, విశాఖ డెయిరీకి పంపుతూ సంస్థ లాభాల బాటలో నడిచేందుకు కృషి చేస్తున్న పాల సంఘాల కార్యదర్శులకు, వర్కర్లకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఐదు సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం చేయడంతో తమ హక్కుల సాధన కోసం సమ్మె చేయడానికి వెనుకాడబోమని కార్మికులు యాజమాన్యాన్ని హెచ్చరించారు. శుక్రవారం అనకాపల్లి నూకాలమ్మ గుడి రోడ్‌లో ఉన్న సత్యాస్ లక్ష్మీ గ్రాండ్స్ ఫంక్షన్ హాల్‌లో సంఘం అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల సర్వసభ్య సమావేశంలో పలువురు మాట్లాడారు. యాజమాన్యం కార్మికులు పట్ల హీనంగా చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నందున భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కలుగ జేసుకొని ఈ కార్మికులకను డెయిరీ ఉద్యోగులుగా గుర్తించి కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసినట్రస్టులో యాజమాన్యం వాడుకున్న ఎనిమిది కోట్ల రూపాయలను తిరిగి వడ్డీతో చెల్లించి ట్రస్టు అకౌంట్లో జమ చేయాలని కోరారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుండి సుమారు 2000 మంది కార్యదర్శులు, వర్కర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.ఎస్.భద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, దొడ్డి సూర్యారావు, జి. కనకారావు, కరక సోమనాయుడు. శ్రీకాకుళం నుండి ప్రసాద్, విజయనగరం జిల్లా నుండి జామి అప్పలనాయుడు, సన్యాసినాయుడు, రవి, లక్ష్మణరావు, తూర్పుగోదావరి జిల్లా నుండి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికై ఏఐఎస్ఎఫ్ ర్యాలీ

విశాలాంధ్ర - సబ్బవరం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సబ్బవరంలో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం తహశీల్దార్ వెంకట్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, వెళ్లే దారిలో చెత్తను వేయడం వల్ల విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. అదేవిధంగా కళాశాలకు ప్రహరీ, సరిపడ తరగతి గదులు లేక ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులకు ఉదయం, సైన్స్ గ్రూప్ విద్యార్థులకు మధ్యాహ్నం ఇలా ఒంటిపూట తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. ఈ రకంగా విద్యార్థులకు ఒంటి పూట తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు విద్యకు దూరమై చెడు దారి పెట్టే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి తక్షణమే కళాశాలకు అదనపు తరగతులు గదులు, ప్రహరీ, రహదారి నిర్మించి విద్యార్థులు చదువుకోవడానికి మెరుగైన వసతులు కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళా శాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసి దూర ప్రాంత విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్బవరం మండల కేంద్రంగా వసతి గృహాలు లేక దూర ప్రాంత విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాబట్టి తక్షణమే ప్రభుత్వ బిసి బాలుర, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం మండలం నాయకులు ఇమాన్యుల్, ఆది, శ్రీను, నిస్సి, ధనలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది సమస్యలు తెలుసుకునేందుకే పోలీస్ గ్రీవెన్స్ డే

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఎం.దీపిక తన కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. సమస్యల పరిష్కా రానికి సానుకూలంగా స్పందించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## వందరోజుల్లో మంచి ప్రభుత్వం అనిపించుకుంది

విశాలాంధ్ర - అనకాపల్లి: ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం అనకాపల్లి మండలంలో రేబాక గ్రామంలో గ్రామస్తులతో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మమేకమై, ప్రభుత్వ పాలన గురించి గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఇందులో భాగంగా ఒకటవ తేదీనే పింఛన్ల చెల్లింపు, అన్న క్యాంటీన్ ల ఏర్పాటు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రైతుల ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపు తదితర ప్రభుత్వ కార్యక్రమాలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గ్రామస్తులకు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ మంజులవాణి పాల్గొన్నారు.

అచ్యుతాపురం: వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం పాలన భేష్ అని టీడీపీ సీనియర్ నాయకులు గ్రామ ఉప సర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు అన్నారు. శుక్రవారం శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ నేతృత్వంలో మండలంలో ఉప్పవరం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నేటికి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచి పనులను ఇంటింటికి వివరిస్తూ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొరబాబు, కోలాగాని శేషు, అడపా మహాలక్ష్మినాయుడు, బిసి నాయకురాలు షేక్ లాల్, పంచాయతీ సెక్రటరీ పనింద్ర, విఆర్ఓ, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యస్.రాయవరం: నూతన ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని ఇది మంచి ప్రభుత్వము అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్.రాయవరం, దార్లపూడి వెంకటాపురం, ధర్మవరం, గుడివాడ తదితర గ్రామాల్లో అధికారులు స్థానిక కూటమి నాయకులు ఇంటింటా తిరిగి ఇది మంచి ప్రభుత్వం అని కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహశీల్దార్ విజయకుమార్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, ఎన్. వెంకటరాజు, కందుల వెంకటేశ్వరరావు, అల్లు నరసింహమూర్తి, సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ప్రభుత్వం ఏర్పడి మొదటి 100 రోజుల్లోనే "ఇది మంచి ప్రభుత్వం" 'అని ప్రజల చేత అనిపించుకున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మేడిచర్ల గ్రామంలో ఇంటింటికి తిరిగి గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి గల తేడాను ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల మెడకు ఉరితాడు లాంటి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశానన్నారు. మెగా డీఎస్సీ, వికలాంగులకు 6000, వృద్ధాప్య పింఛన్లు 4000 పెంచడం జరిగిందన్నారు. వరద బాధితుల సహాయం, అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం తదితర పనులు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భవిష్యత్తులో ఎన్నో విజయవంతమైన కార్యక్రమాలు చేయడానికి అందరి సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మహేష్ , పూడి నారాయణమూర్తి, సబ్బవరపు రామ నాయుడు, జూ రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ గ్రామ శివారులో నాలుగు లీటర్ల సారాతో ఎం.సిలకారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్టు గొలుగొండ ఎస్సై రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులకు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి సారాతో వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన వ్యక్తిని రిమాండ్‌కి తరలించగా న్యాయమూర్తి 14 రోజులు డిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో నాటుసారా అమ్మినా, తయారుచేసినా అలాంటి వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## మండల స్థాయి ఆటలు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆటలు పోటీలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఈ పోటీలను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు, ప్రజల రక్షణకై సీపీఎం యాత్ర

విశాలాంధ్ర - అచ్యుతాపురం: కార్మికులు, ప్రజల రక్షణకై సీపీఎం యాత్ర చేపడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో బహిరంగ సభ నిర్వహించారు. ఎస్ఈజెడ్‌లో గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళల జీవితాలు అత్యంత నికృష్టంగా ఉన్నాయని, వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదని అన్నారు. ఫార్మా కెమికల్ ఇతర పరిశ్రమంలో ప్రమాదాలు జరుగుతుంటే ఈ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. మరోవైపు ఈ పరిశ్రమల నుంచి వెలబడుతున్న కాలుష్యాన్ని కూడా అరికట్టలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రజలకు జబ్బులు వస్తున్న పట్టించుకునే నాథుడే లేరని, పర్యావరణాన్ని సర్వనాశనం చేస్తున్నా ప్రశ్నించే వారే లేరన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కే.లోకనాథం మాట్లాడుతూ ఈ రక్షణ యాత్రలో పాయకరావుపేట నుంచి పరవాడ వరకు కార్మికులతో పాటు నిర్వాసితుల సమస్యలను తెలుసుకోవడం జరిగిందని భవిష్యత్తులో ఈ సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయడం కోసం ఈ రక్షణ యాత్ర ప్రారంభం మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.ప్రభావతి, విశాఖ జిల్లా కార్యదర్శి. సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకర్రావు, గనిశెట్టి సత్యనారాయణ, అచ్చుతాపురం మండల కార్యదర్శి ఆర్.రాము, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, ఎం. అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.దేముడు నాయుడు, గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావు, ఏ.రాజు, కర్రి అప్పారావు, పి.మాణిక్యం పాల్గొన్నారు.

## చుక్కపల్లి హైస్కూల్లో ఆటల పోటీలు

విశాలాంధ్ర - చీడికాడ మండలంలోని చుక్కపల్లి హైస్కూల్లో ఎంఈఓ-2 బివి రమణ, హెచ్ఎం బివి రమణ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్ 14, 17 లోపు విభాగాల క్రీడ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ కురచా జయమ్మ ప్రారంభించారు. కో కో, కబడ్డీ, వాలీబాల్, సెటిల్, రన్నింగ్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఎంపిక కాబడిన వారు ఈనెల 27, 28 తేదీలలో చౌడువాడలో జరుగు నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మమ్మ, స్కూల్ కమిటీ చైర్మన్ మజ్జి సత్తిబాబు, ఎంపీటీసీ సుంకర వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## చెట్టినాడ్డ్ సిమెంట్ కు క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా గోల్డ్ అవార్డు

**విశాలాంధ్ర-కశింకోట:** క్వాలిటీ సర్కిల్స్ ఫోరం ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్-2024 కన్వెన్షన్ ఉక్కున గరం మల్టీపర్పస్ హాలో రెండు రోజులపాటు జరిగిన కార్యక్రమంలో 'వ్యక్తులపై పెట్టుబడులు, మంచి భవిష్యత్తును నిర్మించడం' అనే థీమ్తో కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు సీజీఎం గాంధీ చేతులమీదుగా చెట్టినాడ్డ్ యూనిట్ హెడ్ ప్రసాద్ బాబు గోల్డ్ అవార్డును శుక్రవారం అందుకున్నారు. కార్యక్రమంలో పరిశ్రమ టిం సభ్యులు కృపా,బాలాజీ,రామకృష్ణ,శివమోహన్, రెడ్డి తదతరులు ఉన్నారు.

## ఫార్మా కార్మికులకు భద్రత కల్పించాలి

**విశాలాంధ్ర-పరవాడ:** ఫార్మా పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె లోకనాథం, కార్యవర్గ సభ్యురాలు బి.ప్రభావతి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఎం అధ్వర్యంలో ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత కొరకై ఈనెల 16వ తేదీన పాయకరావుపేటలో ప్రారంభమైన రక్షణ యాత్ర గురువారం సాయంత్రం పరవాడ మండలం తానాం గ్రామంలోకి ప్రవేశించింది. రాత్రికి తాడిలో సమావేశం నిర్వహించిన అనంతరం శుక్రవారం ఉదయం లంకెలపాలెం, పరవాడ సినిహాల్ కూడళ్ల మీదుగా కొనసాగింది. ఈ సంధర్భంగా ఆయా కూడళ్లలో కార్మికులతో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడారు. వందలాది పరిశ్రమలున్న ఈ పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వం వెంటనే ప్రత్యేక బర్న్ వార్డులతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఇక్కడ ఆ సదుపాయాలు లేకపోవడంతో ప్రమాదాలకు గురైన కార్మికులను అనకాపల్లి, విశాఖకు తరలించే లోపే మృత్యువాత పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేసారు. మరో వైపు ఈసెజ్‌లు వచ్చినప్పుడు స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ వాటిని ఇంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసారు. కాగా పరిశ్రమలో భద్రత, కార్మికుల రక్షణకై సిపిఎం నిర్వహిస్తున్న బైక్ యాత్రకు కార్మికులు, ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు వి.రమణ, పి.మాణిక్యం, వివిశ్రీనివాసరావు, డి.దేముడు, కరణం వెంకట్రావు, కె.సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజా ప్రభుత్వం - ఇది మంచి ప్రభుత్వం

### టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ

**విశాలాంధ్ర-మునగపాక:** మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా, ఇంతవరకు సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించిన కర్రి సాయి కృష్ణ ఇది మంచి ప్రభుత్వం భాగంగా శుక్రవారం మునగపాక మండలం, మునగపాక గ్రామంలో ఉదయం 10 గంటలకు మంచి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్, మునగపాక గ్రామ పార్టీ అధ్యక్షులు దాడి శివ, విల్లూరి సాయిరాం,బిలా లక్ష్మణరావు, సూరిశెట్టి అప్పలనాయుడు, జనసేన పార్టీ నాయకులు బొడ్డెడ అప్పలనాయుడు, సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## వైభవంగా దుర్గాదేవి పందిరి రాట మహోత్సవం

**విశాలాంధ్ర-అనకాపల్లి:** స్థానిక గవరపాలెంలో సతకం పట్టులో కొలువైన శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం దుర్గాదేవి శరన్నవరాత్రి సందర్భంగా ఆలయం వద్ద పందిరాట మహెూత్సవం ఘనంగా జరిగింది. ఈ రాట పూజలో పాల్గొన్న దంపతులు. పి వెంకట అప్పారావు, పొలిమేర శ్రీను, బుద్ధ సంతోష దంపతులు.ఈ ఏడాది దసరా ఉత్సవాలకు నూతన ఉత్సవ కమిటీని నియమించడం జరిగిందని, ఈ కమిటీ రెండు సంవత్సరాలు పాటు ఉంటుందని ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు తెలియజేశారు.

### నూతన కమిటీ ఎన్నిక

బీశెట్టి అప్పారావు కళ్యాణ మండపంలో ఉత్సవ కమిటీ ప్రమాణస్వీకారం మహెూత్సవం జరిగింది. నూతనఉత్సవ కమిటీ చైర్మన్ గా ప్రముఖ వ్యాపారవేత్త భీమరశెట్టి వరాహ నూకరాజు, ఉత్సవ కమిటీ ధర్మకర్తలుగా 9 మందిని నియమించారు. విల్లూరి మాధవ, పిళ్లా తారకేష్, పొలమరశెట్టి యుగంధర్,కర్రి కళ్యాణ్,కాండ్రేగుల వెంకట సాంబశివ, దాడి త్రినాథ్, బిశెట్టి ప్రసన్న, మళ్ళ రాజు, దాడి కిరణ్ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. దేవి శరన్నవరాత్రుల కరపత్రాన్ని, నాటికలు కరపత్రాలని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా దాడి జై వీర్, కొణతాల మురళీకృష్ణ, కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కర్రి సన్యాసినాయుడు, శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజా టెంట్ హౌస్, శ్రీ మరిడిమాంబ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## కూటమి తోనే రాష్టం అభివృద్ధి...

**విశాలాంధ్ర -బుచ్చయ్యపేట:** ఆంధ్రప్రదేశ్ రాష్టం సంక్షోభం లోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రజల చేత అనిపించుకుంటోందనీ ఎల్ బి పి అగ్రహారం మాజీ సర్పంచ్ తమరణ దాసు అన్నారు ఈ సందర్భంగా ఎల్ బి పి అగ్రహారం వడ్డాది లో స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతూ... మెగా డీఎస్సీ లో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టడం. పింఛన్లు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేలు ఇవ్వడం ఒక్కటైతే... మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7000లు చొప్పున ఒకేరోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4.408 కోట్లు రూపాయలు అందించడం గొప్ప విషయం అన్నారు ప్రతి నెలా ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నారు. రూ.1674.47 కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించి అన్నదాతను ఆదుకున్నారు. సూపర్ సెక్స్ కార్యక్రమంలో భాగంగా దీపావళి నుండి మొదటి గ్యాస్ సిలిండర్ కూడా అందించడానికి ప్రభుత్వం సిద్ధమైందనీ అన్నారు . ఈ కార్యక్రమంలో నియోజవర్గ స్థాయి కూటమి నాయకులు టమరణ దాసు దొండ నరేష్ యద్ల రాంమూర్తి, కూటమి నాయకులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు

# గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పై కూటమి నాయకులు మొసలి కన్నీరు : సీపీఎం

### ఆడలేక మద్దెల దరువు

**విశాలాంధ్ర-చోడవరం:** రాష్ట్రంలోని సహకార చక్కెర కర్మాగారాలు అన్నింటి లో అగ్రపథాన నిలిచి, లక్షలాది కర్షక, కార్మిక కుటుంభాలకు జీవనోపాధిని ఇస్తున్న ది. చోడవరం(గోవాడ) చక్కెర కర్మాగారం పై కూటమి నాయకులు మొసలి కన్నిరు కార్చ కుండా, రైతులకు మద్దతు ధర ఇచ్చి, ఫ్యాక్టరీ ను ఆదునీకరించాలని సి.పి.ఎం జిల్లా కార్య వర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేసారు. స్థానిక మీడియాకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేసారు. 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫ్యాక్టరీ పరిరక్షణ కొరకు నియోజకవర్గ జనసేన ఇన్చార్జి రాజా వారు నిరాహారదీక్షలు, పాదయాత్రలు చేసి .. మహజన సభ దగ్గర పడడంతో వినతి పత్రాలు ఇచ్చి రైతులను మభ్య పెట్టి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు పార్లమెంట్ సభ్యులు సి.ఎం రమేష్ తో సహా కూటమి నాయకులు ఇచ్చిన హామిలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలోని సహకార రంగానికే తలమానికమైన చోడవరం (గోవాడ) చక్కెర కర్మాగారం పరిస్థితి పాలకులు, రాచకీయ నేతలు అదుపు ఆజ్ఞలు తో నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడిందని తెలిపారు. ఫ్యాక్టరీ మనుగడ కూడా ప్రశ్నార్థకంగా తయారయ్యిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతీ క్రషింగ్ సీజన్లో ఐదు లక్షల 50 వేల టన్నులు గానుగాట జరిపే ఫ్యాక్టరీ ఇప్పుడు లక్ష టన్నులు ఆడుతుందా లేదా అనే సందిగ్ధంలో ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో మన పంచదారకు డిమాండ్ ఉండేదని, ప్రస్తుతం దిగుమతులు ఎక్కువ అవ్వడం తో ధరలు పతనం అయ్యాయని తెలిపారు. దింతో ఉత్పత్తి వ్యయం కూడా రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఏడాది అప్పులు చేసి రైతులకు పేమెంట్లు చేసె దుస్థితికి పాలక వర్గాలు దిగజార్చాయన్నారు. బకాయిలు సక్రమంగా చెల్లించక పోవడం, రైతులకు గిట్టుబాటు మద్దతు ధర ఇవ్వక పోవడంతోను, ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు సాగు ప్రోత్సాహించక పోవడంతో, ఫ్యాక్టరీ పరిదిలో చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అదికారంలో ఉన్న కూటమి నాయకులు కూడా ఎం.డీ కి వినతిపత్రాలు ఇచ్చి రైతులను నాటకీయంగా మోసం చేయాలని చూస్తున్నారని తెలియజేసారు. సహకార రంగంలో నడుస్తున్న ఈ ఒక్క ఫ్యాక్టరీకి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం పూర్తిగా లేకపోవడం దుర్మార్గామన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో రమారమి రూ. 80 కోట్లు వివిధ రూపాల్లో ఫ్యాక్టరీకి రావడంతో కొంత ఓదార్పు కలిగినా, తట్టుకొని నిలబడే శక్తి రాను రాను కోల్పోతోందని అన్నారు. ఎన్నికల హమిగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ తో సహా కూటమి నాయకులు ఫ్యాక్టరీ కు పూర్వ వైభవం తీసుకు వస్తామని, ఆధునీకరించి రైతులను ఆదు కుంటామని హామీ ఇవ్వడంతో ఫ్యాక్టరీ పై ఆధార పడి జీవిస్తున్న వెయ్యి మంది కార్మిక కుటుంబాలు, 24 వేల రైతుల కుటుంబాలు ఆశతో ఎదురు చూస్తున్నాయని తెలిపారు. కానీ, ఎన్నికల్లో గెలుపొందిన పార్లమెంట్ సభ్యుడు సి.ఎం రమేష్ ఈ విషయమై ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. ఫ్యాక్టరీలో క్రషింగ్ సరళి క్రమేణా తగ్గుతూ వస్తుదని అన్నారు. 2013-14 సీజన్లో 5 లక్షల 51 వేల టన్నులు చెరుకు గానుగ ఆడగా 9.5 శాతం రికవరీ సాధించిందని, అలాంటి ఫ్యాక్టరీ ఇప్పుడు లక్ష టన్నులు చెరుకు ఆడుతుందా లేదా అనే పరిస్థితిలో ఉందన్నారు. రైతులకు చెరుకు మద్దతు ధర ఇవ్వలేక, ప్రభుత్వ ప్రోత్సాహకం లేక పోవడంతో సతమత మౌవుతోందని తెలిపారు. 2021-22 సీజన్లో 2 లక్షల 91 వేల టన్నులు చెరుకు గానుగ ఆడగా, 2022-23 లో 2 లక్షల 21 వేల టన్నులు ఆడిందని అన్నారు. గత సీజన్లో 1 లక్ష 71 వేల టన్నులు క్రషింగ్ జరుపగా, ఈఏడాది లక్ష టన్నులు మాత్రమే ఆడే అవకాశం కనిపిస్తోందన్నారు. ఈనెల 28 న జరుగనున్న మహజన సభలో రైతులు మద్దతు ధర కోసం, ఫ్యాక్టరీ ఆధునీకరణకు కూటమి నాయకుల ఎన్నికల హమిలు అమలుకు, ప్రశ్నించాలని కోరారు..., గత సీజన్లో ఫ్యాక్టరీకి చెరుకు సప్లై చేస్తున్న రైతులకు టన్నుకు రూ.2919 లు చెల్లించవలసి ఉండగా ఇప్పటి వరకు రూ.2500 చొప్పున చెల్లించారని తెలిపారు. మరో 10 కోట్లు ఉంటేనే కానీ రైతులకు మిగిలిన బకాయిలు చెల్లించే అవకాశం లేదని తెలిపారు. రైతుల బకాయిలకు, ఫ్యాక్టరీలో ఇంజనీరింగ్ సెక్షన్, బాయిలింగ్ సెక్షన్ వంటి ముఖ్యమైన విభాగాల్లో పనులకు ఓవరాయిలింగ్ నిధులు కేటాయించ వలసి ఉందన్నారు. ఫ్యాక్టరీకి కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తేనే మనుగడ ఉంటందని, ఫ్యాక్టరీ పై మొసలి కన్నిరు కార్చకుండా, ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసారు.

# తిరుమల లడ్డూ వివాదం పై నిజాలు బయటపెట్టాలి

### లడ్డూ అంశంపై వేగవంతంగా దర్యాప్తు జరగాలి

### ప్రభుత్వానికి ఎంపీ సీఎం రమేష్ లేఖ

**విశాలాంధ్ర-అనకాపల్లి:** ప్రపంచవ్యాప్తంగా హిందువులందరు ఎంతో పవిత్రంగా భావించే కలియుగ దైవం తిరుమల శ్రీవారి ఆలయం పవిత్రతను దెబ్బతీసేలా గత వైస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డు ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు వాడారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించిన విషయం మీద అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేష్ స్పందించారు.ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు.తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వుతో తయారైన నెయ్యి వాడిన విషయం పై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ అంశం ప్రపంచ నలుమూలల ఉన్న కోట్లాది హిందువులను ఎంతో క్షోభకు గురి చేసింది అన్నారు.2019 నుండి 2024 మధ్య వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అంతర్వేదిలో రథదగ్ధం , రామతీర్థంలో శ్రీ రాముని విగ్రహ శిరచ్ఛేదం, హిందూ దేవాలయాల పై దాడులు, విగ్రహాల ధ్వంసం, బలవంత మత మార్పిడులు, ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ప్రార్థన మందిరాలు నిర్మాణం, దేవాలయాల ఆస్తుల ఆక్రమణ ,హిందువుల పండగల పై ఆంక్షలు, తిరుమల , శ్రీశైలం వంటి ప్రముఖ హిందు పుణ్యక్షేత్రాల్లో అన్యమతస్తుల నియామకం, ధార్మికతను దెబ్బతీస్తూ వ్యాపార కార్యకలాపాలు ప్రోత్సహించడం వంటి అనేక హిందూ వ్యతిరేక కార్యకలాపాలు జరిగాయి అని ఆరోపించారు.తిరుమలలో నిత్యం జరిగే అన్నదానంలో నాణ్యతా లోపాలు , దర్శనాల టిక్కెట్లు అమ్మకాలు , సౌకర్యాల కల్పన , అభివృద్ధి పేరిట చేపట్టిన పనుల్లో నిధుల దుర్వినియోగం , టీటీడీ నిధులు మళ్లింపు వంటి అనేక వార్తలు మీడియా కథనలులో వచ్చాయి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.గత ప్రభుత్వంలో హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఇటువంటి అసంఖ్యాక సంఘటనలు జరిగిన క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అన్ని అంశాలపై దర్యాప్తుచేసి, నిందితులను చట్టం ముందుకు తీసుకు వచ్చేందుకు తక్షణమే చర్యలుతీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ అంశం మీద కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళాం అని కేంద్ర ఆహారశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సైతం లడ్డూ అంశంపై దర్యాప్తు జరగాలి అని ఆరోపణల గురించి పూర్తి స్థాయిలో విచారణ జరగాలని వ్యాఖ్యనించారు అని తెలియజేసారు.

# చెరకు మద్దతు ధర టన్నుకు రూ. 3500 చెల్లించాలి...

### కార్మిక, కర్షక బకాయిలు చెల్లించి, ఫ్యాక్టరీ ను ఆధునీకరించండి

### చేతగాక పోతే, తప్పుకోండి, మేం చేసి చూపిస్తాం ...

### జనసేనాని పివిఎస్ఎన్ రాజు

**విశాలాంధ్ర-చోడవరం:** సహకార రంగంలో రాష్ట్రంలోని అన్ని చక్కెర మిల్లులు కంటే అన్నింటా అగ్రగామిగా నిలిచిన అనకాపల్లి జిల్లా ది.చోడవరం (గోవాడ) షుగర్ ఫ్యాక్టరీ రైతులకు 2024-25 క్రషింగ్ సీజన్ లో చెరకు మద్దతు ధరను రూ.3500లు. ఇవ్వాలని, కార్మిక కర్షక బకాయిలు చెల్లించి, ఫ్యాక్టరీ ను ఆధునీకరించాలని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ నిర్వహణ చేతగాకపోతే తప్పుకోండి, జనసేన ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా చెరకు కర్మాగారాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసి రాజకీయాలకు అతీతంగా మద్దతు ధర, కార్మిక కర్షక సంక్షేమానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని శుక్రవారం షుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ ను కలసి, కోరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇంచార్జ్ పివిఎస్ఎస్ రాజు మాట్లాడుతూ రైతులకు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కార్మికులకు పెండింగ్ ఉన్న జీత భత్యాలను చెల్లించాలని తెలియజేసారు. రైతులుకు ఎరువులను, చెరకు దవ్వను సబ్సిడీ పై పంపిణీ చేసి కాటాలు వద్ద ఉన్న సిబ్బంది రైతులతో మమేకమై చెరకు సాగును ప్రోత్సహించడం ద్వారా చెరకు రైతులకు భరోసా ఇస్తూ భవిష్యత్తులో ఫ్యాక్టరీని కాపాడుకునే దిశగా యాజమాన్యం పూర్తి బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఫ్యాక్టరీని ఆదుకోవడానికి అవసరమైన ఆర్థిక వనరులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించడానికి ఉప ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను, సి.ఎం. చంద్రబాబు ను కలుస్తామని తెలిపారు. ప్రభుత్వ పెద్దలకు ఫ్యాక్టరీ పరిస్థితిని పూర్తిగా తెలియజేసి, రాష్ట్రంలోనే సహకారంగంలో ఏకైక ఫ్యాక్టరీగా నడుస్తున్న చోడవరం ఫ్యాక్టరీని అభివృద్ధి దిశగా ముందు తీసుకెళ్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పరావు , మండల పార్టీ అధ్యక్షులు గూనూరు మూలునాయుడు, డి.ఎస్ నాయుడు, మైచర్ల నాయుడు, చోడవరం పట్టణ అధ్యక్షులు కర్రి.రమేష్, బీసీ సెల్ కన్వీనర్ దాడి వెంకట అప్పారావు, ఆదారి రమణ నాయుడు ,పీలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చయ్య పేట యాదవ సంఘం అధ్యక్షుడిగా సింగంపల్లి రమేష్ ఏకగ్రీవం

**విశాలాంధ్ర-బుచ్చెయ్యపేట :** మండలంలో యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు అయింది దానిలో భాగంగా అధ్యక్షుడిగా వడ్డాది గ్రామానికి చెందిన సింగంపల్లి రమేష్ యాదవ్, నేతవానిపాలెం గ్రామానికి చెందిన వియ్యపు రామారావు ను ఉపాధ్యక్షుడిగా , పెదపూడి గ్రామానికి చెందిన వియ్యపు రాజబాబును ప్రధాన కార్యదర్శిగా, చిన కందిపూడి గ్రామానికి చెందినగా మొల్లి రామనాయుడు(టెంపర్)ను వర్కింగ్ ప్రెసిడెంట్, కోశాధికారిగా మల్లం గ్రామానికి చెందిన అడ్లబోయిన అప్పలరాజు, పొట్టి దొరపాలెం గ్రామానికి చెందిన గుద్దేటి రాజును గౌరవ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా కమిటీ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.ఈ మేరకు జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు బర్నికాన బాబురావు ఆధ్వర్యంలో బుచ్చియ్యపేట లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో నియోజకవర్గ అధ్యక్షులు మొల్లి ప్రసాద్ యాదవ్ అధ్యక్షతన సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో సింగంపల్లి రమేష్ యాదవ్ కు సభ్యులు మద్దతు తెలపడంతో మండల యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సింగంపల్లి రమేష్ యాదవ్ ని నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్ యాదవ్ ను జిల్లా నాయకులు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో క్రియాశీలక సభ్యత్వాలతోపాటు సాధారణ సభ్యత్వలతో మండల యాదవ సంఘం బలో పేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు నరసింహామూర్తి, అనకాపల్లి నియోజకవర్గ అధ్యక్షు లు పంచదారల కన్నారావు అనకాపల్లి మండల అధ్యక్షులు సూరిబాబు, గౌరవ కార్యదర్శి మాజీ జెడ్పిటిసి సభ్యులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి వియ్యపు అప్పారావు, విశాలాంధ్ర న్యూస్ రిపోర్టర్ తాతారావు ఏబీఎస్ ఛానల్ అడ్వైజర్ లండ అప్పన్న తదితరుల పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి జెఏసి...

**విశాలాంధ్ర-చోడవరం:** దివ్యాంగ ఉద్యోగులు మరియు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు దివ్యాంగ జాయింట్ యాక్షన్ కమిటీ (జె.ఏ.సి) ఏర్పాటు చేసారు. చోడవరం ప్రేమ సమాజం లో నిర్వహించిన సమావేశంలో జె.ఏ.సి. ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించారు.జిల్లాలోని జె.ఏ.సి. ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కులు, సంక్షేమం కోసం అనకాపల్లి జిల్లాలో సహకారంగా పనిచేయనుంది. కొత్తగా ఏర్పడిన కమిటీలో గౌరవ అధ్యక్షులు గా ఆర్క్ ప్రసాద్, అధ్యక్షుడుగా ఎ. శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుగా పి.ఎస్.టి. పట్నాయక్, అధ్యక్షుడుగా పి. వీరుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా వి. చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్. అర్జున్ రావు, ఉపాధ్యక్షుడుగా గణిరెడ్డి రాము, సంయుక్త కార్యదర్శిగా ఎం. అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శి గా జి. సురేష్ లు వున్నారు.ఈ కమిటీ దివ్యాంగుల సమస్యలను వినిపించేందుకు, మరియు ప్రభుత్వ విధానాలు ఈ సమాజానికి మేలు చేసేలా అమలు కావడానికి సహకరించేందుకు ఒక వేదికగా పనిచేస్తుందని గౌరవ అధ్యక్షులు ఆర్క్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏకగ్రీవంగా కొన్ని తీర్మానాలు ఆమోదించారు. వాటిలో 1. జిల్లాలో దివ్యాంగుల కోసం ఒక కొత్త అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని కేటాయించడం. 2. దివ్యాంగ నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం. 3. దివ్యాంగుల సమావేశాల కోసం సుమారు 1000 మందికి సరిపడే సామూహిక హాల్ కేటాయించడం. 4. అనకాపల్లి పట్టణంలో ప్రధాన కేంద్రాలలో హెలెన్ కెలర్, లూయిస్ బ్రైల్, స్టీఫెన్ హాకింగ్ విగ్రహాలను ఏర్పాటుచేయడం. 5. కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించడం.పై తీర్మానాలను ఆమోదించి, సభ్యుల సర్వ సభ్య సమావేశం కృతజ్ఞతలతో ముగించారు.

## ప్రోటోకాల్ పాటించడంలో పొరపాటు జరగదు : ఎంపీడీవో.

**విశాలాంధ్ర -కె.కోటపాడు:** గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు సమాచారం, ఆహ్వానమిచ్చి వారి భాగస్వామ్యం తో ప్రభుత్వం కార్యక్రమాల విజయవంతం చేయాలని మండలం స్థాయి అధికార్లను ఎంపీడీఓ ఎస్.అప్పలరాజు అన్నారు.ఇక్కడి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్యసమావేశం జరిగింది. ఇటీవల అర్లి సెజ్ నిమిత్తం భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే పర్యటనలో ఎంపీపీ, అర్లి గ్రామ సంబంధిత ఎంపీటీసీ సభ్యుడయిన రెడ్డి జగన్ మోహన్ కు ఎందుకు సమాచారం ఇవ్వలేదని చౌడువాడ ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేష్ డిప్యూటీ తాసిల్దార్ , ఎంపీడీఓలను అడిగారు.దీనికి స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ అర్లిలో కలెక్టర్ సందర్శన కార్యక్రమం ముందురోజు రాత్రి సుమారు 7:30గంటల వరకూ ఖరారు కాలేదన్నారు.ఈ నేపథ్యంలో సమయాభావంతోపాటు ,పనుల్లో నిమగ్నమై ఎంపీపీకి సమాచారం ఇవ్వలేకపోయాం తప్ప ఉద్దేశపూర్వకంగా కాదని తెలిపారు.ఇకపై ప్రోటోకాల్ పాటించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని ఎంపీడీఓ అప్పలరాజు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సర్పంచ్ లకు,ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వడం మర్చిపోవద్దని మండలస్థాయి అధికార్లకు ఎంపీడీఓ ఆదేశించారు.మా గ్రామ వి.అర్.పి.పై ఫిర్యాదు అసత్యమని విచారణలో తేలినందున చర్యలు తీసుకోవద్దని ఎల్.వి.పాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు అధికార్లను కోరారు.దీనిపై స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ ఫిర్యాదులపై పారదర్శకంగా బహిరంగ విచారణ జరిపి నివేదిక ఉన్నతాధికారులకు అందించడం వరకే మా పరిమితి అన్నారు.రీసర్వే డేటాపై చౌడువాడ ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేష్,ఈ-క్రాప్ నమోదుపై సూదివలస ఎంపీటీసీ సభ్యుడు వర్రి రామునాయుడు తమ సందేహాలను హెచ్.డి.టి.రమేష్,ఏఓ సోమశేఖర్ ను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.